# భవిష్యత్తు యువతదే

## కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు




**హెదరాబాద్, ఆంధ్రప్రభ:** మన దేశానికి మానవ వనరులే అతిపెద్ద సంపద అని కేంద్రపట్టణాభివృద్ధి శాఖమంత్రి వెంకయ్యనాయుడు వెల్లడించారు. శిల్పకళావేదికలో జరుగుతున్న ది ఇన్సిట్యూట్ ఆఫ్ కాస్ట్ అక్కౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 56వ జాతీయ సదస్సులో భాగంగా ఆదివారం మంత్రి సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.వ్యయ నియంత్రణలో మనదేశం లోని గృహిణిలు మంచి నిపుణులని ప్రసంశించారు. దేశంలో ఉన్నంత యువశక్తి ప్రపంచదేశాల్లో మరెక్కడా లేదన్నారు. యావత్తు ప్రపంచం ఇపుడు ఇండియా వైపు చూస్తోదన్నారు. ఇక భారత్‌దే భవిష్యత్తు అని ప్రకటించారు.అమెరికా దేశాధినేత ఒబామ ఇటీవల మనదేశానికి వచ్చి ప్రధానితో ఎలా మెలిగారో అందరూ చూశా రన్నారు. ఇపుడు భారత్‌కు ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు వస్తోందన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం మనదేశ సంస్కృతి సాంప్రదాయం అన్నారు.

దేశానికి ఉపయోగపడే కొత్త ఆలోచనావిధానాలు రావాలన్నారు. స్వచ్‌భారత్ కార్యక్రమం నిరంతరం సాగే ప్రక్రియ అన్నారు. పెరుగుతున్నగడ్డం శబ్రం చేసుకునే తరహాలోనే స్వచ్‌భారత్ జీవితకాలం కొనసాగాలన్నారు. దేశంలో వ్యవసాయం భారంగా మారిందని పెట్టుబడులు పెరిగి రైతుకు రాబడి తగ్గుతోందన్నారు. ఉత్పత్తి రంగాల్లో వ్యయనియంత్రణ కోసం కాస్ట్ అక్కౌంటెంట్ నిపుణుల సేవలు ఎంతైనా అవసరం ఉందన్నారు.ఉన్నత విద్యలో కూడా ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని ఈ అంశంపై కూడా దృష్టిపెట్టాలన్నారు. కుంటుపడిన ఆర్థిక వ్యవస్థ తమకు ముందటి ప్రభుత్వం నుంచి సంక్రమించిందన్నారు. గత పదేళ్ళలో దేశ ఎదుగుదలకు సెలవు లాంటి పరిస్థితి ఉండేదని ఇపుడు ఆ పరిస్థితిని తిరిగి గాడిలో పెడుతున్నామన్నారు. యధారాజ తథా ప్రజ అన్న సామెతను గుర్తును చేస్తూ ప్రధాని మోడి దేశంలో సంస్కరణలపై దృష్టిపెట్టారన్నారు. రేయింబవళ్ళు కష్టిస్తూ మంత్రులను కూడా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. జనధనయోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకూ 11.50కోట్ల మందితో బ్యాంకు ఖాతాలు తెరిపించామన్నారు.

కాలుష్యరహిత సమాజం కోసం అందరం కృషి చేయాలన్నారు. దేశ ప్రజలు అభివృద్ధిదాహంతో ప్రధాని మోడి వైపు ఆశగా చూస్తున్నారన్నారు. అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యపడేది కాదన్నారు. అల్లావుద్దీన్ అద్భుత దీపాలేవి ప్రభుత్వం వద్ద లేవన్నారు. అంతా స్మార్ట్‌సిటీలు కావాలనేవారేఅని అవేవి జోబులోనుంచి తీసి ఇచ్చేవి కావన్నారు. ఒక సిటీని నాశనం చేయాలంటే ఒక్కరోజు చాలనీ, అదే సిటీని అభివృద్ధి చేయాలంటే కొన్నేళ్లు పడుతుందన్నారు. దేశంలో కాస్ట్ అక్కౌంటెంట్స్ పాత్ర గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఎన్.సీ.సీ సావనీర్‌ను విడుదల చేశారు. సీఎంఏకు ఇన్సిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్‌కు మంత్రి సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుని ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సదస్సులో విశాఖ స్టీల్స్ ఛైర్మన్ మధుసూధన్, ఐసీఏఐ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు పివి భాటెడ్, సభ్యులు పద్మనాభన్, రాధాకృష్ణ తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో కాస్ట్ అక్కౌంటెంట్స్ పాల్గొన్నారు.